


# మతిచలించిన ఆ క్షణం

.. డి.ఎస్.పి. విశాల్ విసుక్కున్నాడు. రాత్రి తొమ్మిదిన్నరయినా గది ఇంకా చల్లబడలేదు. ఏ.సి. ఆవిర్లు కక్కుతున్నట్టుంది, మసీదు వీథిలో ఫైర్ ఏక్సిడెంట్ తాలూకు వేడి గాలుల వల్లనేమో! స్ట్రామాట్ సూపర్ బజారయ్యుంటుంది. సాయంత్రం నుంచి కాలిపోతోంది. తన ఉద్యోగాన్ని ఎప్పుడూ తిట్టుకుంటూండే విశాల్ తను ఫైర్‌మన్ కాకుండా పోలీసు అయినందుకు సంతోషించాడు ఆ క్షణంలో. మరుక్షణమే గుర్తుకు వచ్చింది, ఐదు వందల రూపాయల దొంగనోట్ల గొడవ. ఏ నోట్లు మంచివో, ఏవి కావో తెలియక చలామణీ నియంత్రించడానికి ప్రభుత్వంవారు డిక్లరేషన్లు ఇమ్మనడం, ఆ డిక్లరేషన్లు నిజమో, అబద్ధమో చూసే పని పోలీసు శాఖకు అప్పగించడం, అవి కనిపెట్టలేక తమ డిపార్టుమెంటు సతమతమవ్వడం పై జన్మలో చచ్చినా పోలీసు ఉద్యోగం చేయకూడదురా బాబూ అనుకున్నాడు విశాల్.

అతనికి సై అన్నట్టు అంతలోనే ఫోన్ మోగింది. పోలీసు కష్టాలు గుర్తు చేస్తూ. గాంధీనగర్ పోలీసు స్టేషన్నుంచి ముత్యాలరావు ఫోన్. "సార్! మీరు వెంటనే ఇక్కడకు రావాలి!" అంటూ. తప్పదుగా, బయలుదేరాడు. జీపు వేగంగా డ్రైవ్ చేస్తున్నా ముత్యాలరావు చెప్పినదానిమీదే తిరుగుతున్నాయి అతని ఆలోచనలు. సి.ఐ.డి. ఇన్‌స్పెక్టర్ అరవింద్ హఠాత్తుగా వశం తప్పాడట. టపటపా నలుగురిని కాల్చిపారేశాట్ట. అతన్ని అదుపు చేయడమెలాగో తెలీక ముత్యాలరావు అరవింద్‌ని కాల్చేశాడు. గుండు దెబ్బతిన్న వాళ్లలో పోలీసు స్టేషన్‌లో పనిచేసే రైటరు ఒకడు. అతను అక్కడికక్కడే చచ్చిపోయాట్ట. అరవింద్ ఇంత వెర్రెక్కిపోయి ప్రవర్తించడం ఎన్నడూ జరగలేదు.

అరవింద్ మంచి ఇన్‌స్పెక్టరే. చాలాకాలంగా పనిచేస్తున్నాడు ఇదే స్టేషన్‌లో. నార్కోటిక్స్ పట్టుకునే విభాగంలో పనిచేస్తున్నాడు. అతనిలా ఎందుకు చేయాలి? ఎవరైనా రెచ్చగొట్టారా? లేదుట. స్టేషన్‌లో వివరాలడిగితే తెలిసింది.

రాత్రి తొమ్మిదింపావుకి రైటరు ఓ అరెస్టు



ఎమ్బీయస్ ప్రసాద్

# థ్రిల్లింగ్ కథలు

వారంటు టైపు చేస్తున్నాడు. పెట్రోలింగ్ చేసే పోలీసులు ఇద్దరు ఒకతన్ని అరెస్టు చేసి తీసుకువచ్చారు. వాళ్లంతా సామ్రాట్ సూపర్ బజార్‌లో అగ్నిప్రమాదం గురించి మాట్లాడుతున్నారు. అంతలోనే అరవింద్ వచ్చాడు. సివిలియన్ డ్రెస్సులోనే, డ్యూటీలో లేకపోయినా ఊరికే స్టేషన్‌లో పలకరించడానికి వచ్చాడు. వస్తూనే వీళ్లని చూడగానే జేబులోంచి తుపాకీ తీసి కాల్చడం మొదలుపెట్టాడు. లోపల ఏదో పనిచేసుకుంటున్న ముత్యాలరావు పేలుళ్ల శబ్దం విని బయటకు వచ్చేలోపునే, రైటరు అరవింద్‌ను ఆపబోవడం, అతని కాల్పులకు నేలకొరగడం జరిగిపోయింది. అరవింద్ ట్రాఫిక్ పోలీసులను, వాళ్లు అరెస్టు చేసి తెచ్చినవాణ్ణి అందరినీ కాల్చాడు. దాంతో ముత్యాలరావు తన రివాల్వర్‌తో అరవింద్‌ను కాల్చాడు.

"నిజానికి నేను కాల్చేటప్పటికి అరవింద్ తుపాకీలో గుళ్లు అయిపోయాయి, సార్! కానీ నాకా విషయం తెలియదు. దాంతో ..." అన్నాడు ముత్యాలరావు బిక్కమొహం పెట్టి. విశాల్ అతని అవస్థ గమనించాడు.

"ఫర్వాలేదులే, నేనున్నా అదే చేసేవాణ్ణి!" అంటూ అతన్ని ఓదార్చి, "ఇంతకీ వాళ్ల పరిస్థితి ఎలా ఉంది?" అంటూ వాకబు చేశాడు.

"రైటరు ఇక్కడే చచ్చిపోయాడు. తక్కినవాళ్లందరినీ హాస్పిటల్‌కి తరలించాం. అందరి పరిస్థితీ ఆందోళనకరంగానే ఉంది. ఏమీ చెప్పలేమంటున్నారు డాక్టర్లు. ఇక్కడ విలేఖరులు వచ్చి చుట్టుముట్టేశారు. ఒక సి.ఐ.డి. ఇన్‌స్పెక్టరు పిచ్చెక్కినవాడిలా అలా ప్రవర్తించడానికి కారణాలేమిటి? అంటూ చంపుకుతింటున్నారు."

"నాకూ అదే ఆశ్చర్యంగా ఉంది. అరవింద్ కేమైనా డ్రగ్స్ తీసుకునే అలవాటుందా?"

"అబ్బే, అదేమీ ఉన్నట్టు లేదు. పైగా అతను పనిచేసేదే డ్రగ్ ట్రాఫికింగ్ అరికట్టే శాఖలో. మంచి సమర్థవంతుడైన ఆఫీసరుగా పేరు తెచ్చుకున్నాడు. నిన్న రాత్రే మా ఇంటికి భోజనానికి వచ్చాడు కూడా."

"ఫామిలీతోనా?"

"అతనికి కుటుంబం అంటూ ఏమీ లేదండీ! అతని భార్య నాలుగేళ్ల క్రితం ఎవడితోనో పారిపోయింది. అప్పటినుంచి అతని మెంటాలిటీ అదోలా అయిపోయింది. అందరినీ, ముఖ్యంగా ఆడవాళ్లని, తెగ అనుమానిస్తాడు. అఫ్‌కోర్స్, మన పోలీసు ఉద్యోగానికి అది చాలా మంచిదనుకోండి ...!" విశాల్ తల ఊపాడు. హాస్పటల్‌కి దారితీశాడు.

డాక్టర్ సుబ్బారావు చెప్పుకొచ్చాడు "అరవింద్ పరిస్థితి ఏమీ బాగాలేదు. ఆపరేషన్ చేయబోతున్నాం. పెట్రోలింగ్ పోలీసుల్లో ఒకతను, ఆనందరావు అనుకుంటా, అతనికి పొట్టలో గుండు దూరింది. కానీ ఫర్వాలేదు. ఇంకో అతను కూడా సో సో. కానీ అమ్మాయికి మాత్రం ఇంకా స్పృహ రాలేదు."

"అమ్మాయా? అమ్మాయెవరు?"

"అమ్మాయే! మగాడి దుస్తులు వేసుకున్న అమ్మాయి."

"స్టేషన్ నుంచే తెచ్చారా? లేకపోతే వేరే కేసా?"

"స్టేషన్ నుంచే తెచ్చారండి బాబూ! అమ్మాయే? ఓ ముప్పై ఏళ్లుంటాయి. కాకపోతే బాయ్‌కట్ హెయిర్ స్టయిల్. మగాళ్ల డ్రెస్సు వేసుకుంది. అంతే!"

విశాల్ ఆశ్చర్యంలోంచి తేరుకుంటూండగానే ఆయన "సారీ, పని ఉంది!" అంటూ వెళ్లిపోయాడు.

కాస్సేపటికి ఆనందరావుతో మాట్లాడుతుండగా విశాల్ అరవింద్ ప్రస్తావన తెచ్చాడు. "అరవింద్ అలా ఎందుకు చేశాడంటావ్?"

"నాకేం తెలుసు? అతను స్టేషన్‌లోకి వస్తూనే తుపాకీ తీసి కాల్చడం మొదలుపెట్టాడు. ఓ మాటా లేదు, మంతీ లేదు. నా కాళ్లోంచి గుండు దూసుకుపోయింది. నాకు స్పృహ తప్పింది. ఇప్పుడు మీరు చెబితేనే తెలుస్తోంది ఏం జరిగిందో."

"మీరు అరెస్టు చెసి తెచ్చిన ..."

"... అతనికి కూడా తగిలాయా?"

"తగిలాయి. కానీ అతను కాదు, ఆమె!" అన్నాడు విశాల్ ఆనందరావు మొహం పరీక్షగా చూస్తూ.

ఆనందరావు ఆశ్చర్యంతో దిగ్గున లేచి కూర్చోబోయాడు. కానీ వీలుపడలేదు. "అమ్మాయా?"

"అవును. మగాళ్ల బట్టలేసుకున్న ముప్పై ఏళ్ల అమ్మాయి. ఇంతకీ మీరామెను ఎందుకు అరెస్టు చేసినట్లు?"

"నేనూ, వెంకటేశ్వర్లు రొటీన్‌గానే రౌండ్లు కొడుతున్నాం. అంతలో వీడు ... అబ్బాయనే అనుకున్నాంలెండి ... ఓ షాపు అద్దాలు పగలగొడుతూ కనపడ్డాడు. తాగి ఉన్నాడేమో, స్టేషన్‌కి తీసుకెళ్లి పడేస్తే మంచిదని మాతో తీసుకెళ్లాం. అందుకే చేతికి కఫ్స్ కూడా వేయలేదు!"

"అరవింద్ మీ ఖైదీతో ఏమైనా మాట్లాడాడా?"

"అబ్బే, అసలు చూశాడో లేదో కూడా తెలియదు. నేను ఇందాకనే చెప్పానుగా, నన్ను

## నాలుగుభాషల్లో ఒకేసినిమా

ఒకభాషలో సినిమా తీస్తే నాలుగైదు భాషల్లోకి దానిని డబ్ చేయడమంటే సర్వసాధారణమైన విషయమేకాని, ఒక భాషలో హిట్ అయిన సినిమాని మరో మూడుభాషల్లో పునర్నిర్మించడమంటే ఆషామాషీ కాదు. అంత దమ్ము ఆ సినిమాలో తప్పకుండా ఉండితీరుతుంది. ఇదంతా దేనిగురించో కాదు; 'సూర్యవంశం' సినిమాగురించే. మొదట ఈ సినిమా తమిళంలో విక్రమన్ డైరెక్షన్‌లో వచ్చింది. అక్కడ రికార్డుస్థాయిలో హిట్ అవడంతో దీనినే తెలుగులో వెంకటేష్‌తో పునర్నిర్మించారు. ఆ తరువాత తాజాగా హిందీలో అమితాబ్‌తో తీశారు. ఈ రెండు భాషల్లోనూ అదేస్థాయిలో హిట్ అయింది. అందుకే కన్నడంలోకూడా ఈ 'సూర్యవంశం' తీస్తున్నారు. విష్ణువర్ధన్, ఇళా జంటగా నటిస్తున్నా రిందులో. అక్కడకూడా హిట్ అయితే, భారతీయభాష లన్నింటిలోనూ 'సూర్యవంశం' సినిమాకు గిరాకీ పెరుగుతుంది.



**హిందీ 'సూర్యవంశ్'లో సౌందర్య, అమితాబ్............**

**ఎల్.**

కాల్చేవరకూ అరవింద్ అక్కడకు వచ్చిన విషయమే నాకు తెలియదు?"

రోగిని శ్రమ పెట్టవద్దని డాక్టర్ హెచ్చరించడంతో విశాల్ బయటకు నడిచాడు. బయటకు వచ్చాక, "మీరు ఆ అమ్మాయి బట్టల గురించి అడిగారుగా, ఇవిగో!" అన్నాడు డాక్టరు ఓ మూట అందిస్తూ.

జేబుల్లో చూడబోతే పెద్దగా ఏమీ లేవు. కాస్త చిల్లర, జేబు రుమాలు, ఒక అయిదువందల రూపాయల నోటు. మత్తు పదార్థాలవంటివి ఏమీ లేవు. ఆమె అవి సేవించినట్టుగా దాఖలా కూడా ఏమీ లేదన్నాడు డాక్టరు.

మర్నాడు పొద్దున అరవింద్ ప్రస్తుత కార్యకలాపాల గురించి మరిన్ని ఆరాలు తీయబోయాడు విశాల్. "మత్తుమందుల వ్యాపారం గురించి పరిశోధిస్తున్న మాట నిజమేగానీ, ఈమధ్య అంతకంటే పెద్ద రాకెట్ ఏదో దొరికిందన్నాడు!" అని చెప్పాడు అరవింద్ చీఫ్.

"ఏమిటది?"

"500 రూపాయల నోట్ల రాకెట్. దొంగనోట్ల చలామణీ అరికడదామని, ప్రభుత్వంవాళ్లు ఎవరు ఐదు వందల రూపాయల నోటు పట్టుకొచ్చినా అది చేతికెలా వచ్చిందో వివరిస్తూ డిక్లరేషన్ ఇమ్మని అడుగుతున్నారు కదా! నోట్లన్నీ పట్టుకొచ్చి గోడౌన్స్‌లో పెడుతున్నారు కదా!"

"అవును, దానికీ, దీనికీ లింక్ ఏమిటి?"

"ఈ డ్రగ్ వ్యాపారంలో ఇన్నాళ్లూ పేమెంట్స్ ఐదువందల రూపాయల నోట్లతోనే జరిగేవి. ఇప్పుడీ డిక్లరేషన్ గొడవ రావడంతో ఇప్పటిదాకా పోగేసిన నోట్లని సూపర్ బజార్ల ద్వారా లాండరింగ్ చేస్తున్నారని కనుక్కున్నాడు అరవింద్."

"అంటే, సూపర్‌బజార్ వాళ్లు తక్కువ ధరకి ఈ నోట్లు కొనేసి, వ్యాపార లావాదేవిల్లో ఈ నోట్లు వచ్చాయని ప్రభుత్వానికి డిక్లరేషన్ ఇస్తున్నారా?"

"... అనే అంటాడు అరవింద్. మీ దగ్గర, నా దగ్గర అయితే కనుక్కోవడం ఈజీ. సూపర్‌బజార్ అనగానే లక్షలమీద వ్యాపారం. వాళ్లిచ్చిన స్టేట్‌మెంటు నమ్మాల్సిందే. అరవింద్ ఈ ఏంగిల్లో ఇన్వెస్టిగేట్ చేస్తున్నాడు. ఏ సూపర్‌బజార్ ద్వారా ఎక్కువ నోట్లు చలామణీలోకి వస్తున్నాయి, అక్కడ అంత బిజినెస్ అవుతోందా, లేక తక్కువ రేట్లో కొనేసి ఈ నలుపుని తెలుపు చేస్తున్నారా? అన్న విషయాలు కూపీ లాగుతున్నాడు."

"ఎన్నాళ్లుగా?"

"రెండు నెలలుగా. మొన్ననే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వాళ్లకి చెబితే వాళ్లు ఆరోగ్యస్వామి అనే అతన్ని తోడుగా పంపిస్తామని చెప్పారు. అతను ఈ లైన్లో ఇంతకుముందే వర్క్ చేశాట్ట. లెక్క ప్రకారం ఇవాళ అతనూ, అరవింద్ కలవాలి కూడా. మధ్యలో ఇలా జరిగింది. అసలు అరవింద్ అలా చేస్తాడని నేను కలలో కూడా అనుకోలేదు."

విశాల్ ఆలోచనలో పడ్డాడు. కథకి ఇది కొత్త కోణమే. అరవింద్ ఎవరెవరిని కలిసి ఉంటాడు? కనుక్కోవాలి. ఇంతలో ఆ అమ్మాయి దుస్తుల్లో 500 రూపాయల నోటు కనపడ్డ విషయం గుర్తుకు వచ్చింది. ఈ రెండింటికీ ఏమైనా సంబంధం ఉందా? ఏమో!

విశాల్ హాస్పిటల్‌కి చేరేసరికి స్పృహలోకి రాకుండానే అరవింద్ పోయినట్లు తెలిసింది. ఇక మిగిలినది ఆ అమ్మాయి. పరిస్థితి మెరుగుపడిందని తెలిసి వెళ్లి వివరాలు అడిగాడు.

"నా పేరు సుజాత. ఆర్టిస్టుని" అందామె.

"మగవాళ్ల డ్రెస్సు వేసుకుని ఎందుకు తిరిగుతున్నావు?"

"మగవాళ్ల డ్రెస్సు అని వేసుకోలేదు. నా కిష్టమైన డ్రెస్సు. నేను ఎప్పుడూ వేసుకునే డ్రెస్సు."

"అది సరే, షాపు కిటికీలు పగలగొట్టడం కూడా నీకిష్టమేనా? పాపం పోలీసు పెట్రోలు వాళ్లు దగ్గరలో ఉన్నారని తెలియదు కాబోలు!"

"అందుకని తుపాకి పెట్టి కాల్చేస్తారా?"

"నో, నో! ఓ పొరపాటు వల్ల అలా జరిగింది. నిన్ను కాల్చినది అరవింద్ అనే అతను. బై ది వే, అతను నీకు తెలుసా?"

"లేదే, ఎవరతను?"

"నిన్నూ, ఇంకో ముగ్గుర్నీ కాల్చాడు. అతన్ని మావాళ్లు కాల్చారు. ఇవాళ పొద్దున్నే పాపం, పోయాడు. అన్నట్టు నీ అడ్రస్సేమిటి? మేం రికార్డుల్లో రాసుకోవాలి."

ఆమె చెప్పింది. అరెస్టయిన చోటు నుండి దగ్గర్లోనే ఉందా లోకాలిటీ. "అవునూ, నీ జేబులో ఐదు వందల రూపాయల నోటు దొరికింది. ఎక్కడిది?"

"చెప్పానుగా, నేను ఆర్టిస్టునని. ఒకాయన బొమ్మ గీసి ఇచ్చి వస్తూండగానే మీ వాళ్లు పట్టుకున్నారు. ఆయన ఇచ్చిందే ఆ నోటు."

విశాల్‌కి అంతుపట్టలేదా అమ్మాయి. గట్టిగా తరచి అడుగుదామంటే డాక్టర్లు అడ్డుపడతారని భయం. కొద్దిగా కోలుకుంటున్న వెంకటేశ్వర్లుని కలిసి ఆమె గురించి కదలేశాడు. అతనూ ఆశ్చర్యపడ్డాడు ఆమె అమ్మాయని తెలియగానే.

"నేనూ, ఆనందరావూ అరెస్టు చేసినప్పుడు కూడా మాకు తెలియలేదు. ఏదో న్యూసెన్స్ కేసు పెట్టి వదిలేద్దామనుకున్నాం. ఈమాత్రానికి సంకెళ్లెందుకు అన్నాడు ఆనందరావు!" అన్నాడు.

అరవింద్ ఆ అమ్మాయిని చూశాకనే తుపాకీ తీశాడా?"

"మేం వస్తూండగానే ఆ అమ్మాయిని చూశాడు. అది మాత్రం చెప్పగలను."

"వాళ్లిద్దరికీ ముందుగానే ఏమైనా పరిచయం, పోట్లాట ..."

"మనకదేమీ తెలియదు. అసలు మన ఎదురుగా మాట్లాడితేగా. ఇంకో విషయం చెప్పమంటారా? ఈ కుర్రాడు, అదే కుర్రది ... కావాలని అరెస్టయినట్టనిపించింది మాకు. అదేదో కథలో చలికాలంలో రాత్రి రూము దొరక్క, లాకప్‌లోనైనా వెచ్చగా పడుకుందామని ఒకడు చిన్న నేరం చేస్తాడు చూడండి, అలాగ!"

విశాల్ నవ్వాడు. "పోలిక బాగానే ఉంది గానీ, ఇది వేసవికాలం మరి!"

ooo

ఆఫీసుకెళ్లేసరికి ఆరోగ్యస్వామి వెయిట్ చేస్తున్నాడు. 500 రూపాయల నోట్ల గురించి అతను చాలానే చెప్పాడు. ఏయే సిటీల్లో .

సూపర్‌బజార్లు ఎక్కువ డిక్లరేషన్స్ ఇస్తున్నాయో గ్రాఫ్‌లు గీసి రెడీగా పెట్టుకున్నాడతను. ఈ ఊళ్లో సామ్రాట్ సూపర్‌బజార్ ద్వారా ఇలాంటి లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్నాయట. సామ్రాట్ పేరు వింటూనే విశాల్ ఉలిక్కిపడ్డాడు. నిన్న ఫైర్ ఏక్సిడెంట్ జరిగిందక్కడే. ప్రమాదానికి కారణం కూడా ఇంకా సరిగ్గా నిర్ధారించబడలేదు. ఆ మాటే ఆరోగ్యస్వామితో అంటే, అతను చిరునవ్వు నవ్వాడు.

"సాక్ష్యాన్ని నాశనం చేయడానికి నిప్పును మించినది లేదు!" అన్నాడు.

"అంటే...?"

"సేకరించిన 500 రూపాయల నోట్లన్నీ దాస్తున్న గోడౌన్‌లో ఈమధ్యే చోరీ జరిగింది. ఇన్‌సైడ్ జాబ్ అనే అనుకుంటున్నాం. ఆ నోట్లు సామ్రాట్‌కి చేరి ఉంటాయి. నెమ్మదిగా చలామణీలో పెడదామని దాచి ఉంటారు. నేనిక్కడికి వస్తున్నానని తెలిసి నిప్పు ముట్టించి మొత్తం తగలేశారు. నేరమూ బయటపడదు. ఇన్సూరెన్స్ డబ్బూ ముడుతుంది."

సామ్రాట్ మేనేజర్ సర్వోత్తమరావు అదేమీ కాదన్నాడు. ఇన్సూరెన్స్ వస్తే కంపెనీకి వస్తుంది, కానీ తనకు కాదన్నాడు. నిప్పు పెట్టి స్టోర్స్‌ని తగలేయాల్సిన అవసరం తనకు లేదన్నాడు. విశాల్ వాదించబోతే ఆయన విసుక్కున్నాడు. "అసలే మా అమ్మాయి హాస్పటల్లో ఉంది. చూసి వస్తూండగానే మీరు తగులుకున్నారు. నా మనస్సు వికలంగా ఉంది. మీకేదైనా ఆధారం దొరికితే ప్రొసీడ్ అవ్వండి. అంతేగాని ప్రశ్నలతో నా ప్రాణం తీయకండి!"

ఆయన మొహం పరిచితంగా అనిపించిందెందుకో తట్టని విశాల్‌కి హాస్పటల్లో కూతురు అనగానే చప్పున స్ఫురించింది. "సుజాత ... అదే, పోలీస్ స్టేషన్‌లో కాల్పులకు గురయిన అమ్మాయి ... మీ అమ్మాయా?"

ఆయన మొహం మాడిపోయింది. "అవును. మా అమ్మాయే! అసలు పేరు సునీత. చెప్పిన మాట వినదు. పాకెట్ మనీకోసం బొమ్మలేస్తానని చెప్పి ఓ గది అద్దెకు తీసుకుంది. మా సూపర్‌బజార్లోనే అక్కౌంట్లు రాసే పని అప్పగించాను. అయినా ఆ బొమ్మలు మానదు. పేరు తప్పు చెప్పడమెందుకో, తండ్రి పేరు చెప్పకపోవడమెందుకో నాకు అర్థం కాదు!"

ooo

"మీ నాన్నగారు సర్వోత్తమరావుగారిని కలిశాను, సునీతా!" అన్నాడు మర్నాడు ఉదయం విశాల్ హాస్పిటల్లో.

ఆమె ముఖం మాడిపోయినా, వెంటనే తేరుకుని, "అయితే ఏమిటట?" అంది.

"పాపం, మంచాయన. నువ్వు 500 రూపాయల నోట్లని ఆయన సూపర్‌బజార్ ద్వారా చలామణీ చేస్తున్న విషయం ఆయనకి తెలియనే తెలియదు. ఎక్కౌంట్లు రాయడానికే వస్తున్నావనుకుంటున్నాడాయన. గోడౌన్‌లోంచి అరవింద్ దొంగిలించి తెచ్చిన నోట్లు నువ్వు అక్కడే దాచావని కూడా ఆయనకి తెలియదు. అన్నట్టు ... ఈ 500 రూపాయల నోట్ల వ్యవహారంలోనేనా అరవింద్, నువ్వు దగ్గరయింది?"

సునీత గొంతు సవరించుకుంది. "అవును. నేను చిన్న లెవెల్లోనే చేసేదాన్ని. కానీ అరవింద్ పెద్ద ఎత్తున ప్లాన్ చేశాడు. అతను ఈ రాకెట్ గురించి ఇన్వెస్టిగేట్ చేస్తూ సామ్రాట్‌కి రావడంతో మా పరిచయం జరిగింది. రెండు నెలల్లో ఇద్దరం చాలా దగ్గరయ్యాం. నేను వద్దన్నా వెళ్లి దొంగతనం చేసి బోలెడు నోట్లు తెచ్చాడు. బేస్‌మెంట్ గోడౌన్‌లో దాచాను. ఇంతలో ఆరోగ్యస్వామికి సామ్రాట్‌మీద అనుమానం వచ్చి సెర్చి వారెంట్ తెస్తున్నాడని వార్త మోసుకొచ్చాడు అరవింద్. అవి అక్కణ్ణుంచి తొలగించడానికి వ్యవధి లేకపోయింది!"

"అందుకని దానికి నిప్పు ముట్టించావు. ముట్టించాక ఎలిబీ ఉండాలని కావాలని పోలీసు వాళ్ల కెదురుగా కిటికీ బద్దలుకొట్టి అరెస్టయి కూర్చున్నావు. ఆడపిల్ల అంటే అరెస్టు చేయరేమోనని, జుట్టు కత్తిరించుకుని, మగాళ్ల డ్రెస్సు వేసుకుని మరీ చేశావు. ఖర్మం చాలక బయటపడితే అబ్బే, నేను పోలీసు స్టేషన్లో ఉన్నాను అని బుకాయించాలని నీ ప్లాను."

సునీత తల వంచుకుంది. "అరవింద్ అక్కడకు వస్తాడని నేననుకోలేదు!" అంది మెల్లగా.

"అంతేకాదు, వచ్చినా అతనలా ప్రవర్తిస్తాడని నువ్వు ఊహించలేదు. ఎందుకంటే అతని గత చరిత్ర నీకు పూర్తిగా తెలిసి ఉండదు. అతని భార్య అతన్ని వంచించి ఇంకొకడితో పారిపోయింది. ఇప్పుడు కూడా నువ్వు అతన్ని వంచించావని పొరబడ్డాడు అతను. అందుకనే వెంటనే తుపాకీ తీసి నిన్ను కాల్చేశాడు."

"... నేనలాంటిదాన్ని కాదు ...!"

"అది అతనికి తెలియదు. నువ్వు ఇద్దరు పోలీసులతో కలసి వచ్చావు స్టేషన్‌కి. చేతులకి సంకెళ్లు లేవు. అంటే నువ్వు నేరం ఒప్పేసుకుని తన పేరు కూడా చెప్పేసి ఉంటావు అనుకున్నాడతను ఆ క్షణంలో. అందుకే వెర్రెక్కినట్టు అందరిమీదా కాల్పులు జరిపాడు. ముత్యాలరావు కాల్చి ఉండకపోతే అతను అందర్నీ కాల్చుకుంటూ వెళ్లేవాడు."

సునీత ఏడ్చింది కాసేపు. "అతని మతి చలించింది. నేను అలా చేస్తానని ఎలా అనుకున్నాడో ..." అంది.

"మతి చలించడానికి ఒక్క క్షణం చాలు!" అన్నాడు విశాల్ ఆమె చేతికి సంకెళ్లు వేస్తూ.

■

## హీరోయిన్ గారి చదువు

తెలుగులో ఒకే ఒక్క సినిమా 'సూర్యపుత్రిక'లో తప్ప మరెందులోనూ అవకాశాలు రాకుండాపోయిన ఇంద్రజ ఆ షూటింగ్ గాప్‌లో ఏవో పుస్తకాలు తిరగేస్తూ కనిపించింది. ఏ బుక్స్ అవి అని ఆరాతీస్తే...బి.ఎ. ఫస్టియర్ బుక్స్ అని తెలిసింది. ఎందుకు అంటే..."నాకు మొదటినుండీ బి.ఎ. చదవాలని(అదేదో ఐ.ఎ.ఎస్.లా పోజుపెట్టి) ఉండేదికాని, కుదురలేదు. ఎలాగైనా డిగ్రీ పూర్తిచేయాలని పట్టుబట్టి బి.ఎ. కట్టాను. షూటింగ్ గాప్‌లో వేరే ఆలోచనలు పెట్టుకోకుండా చదువుకోవడం మొదలుపెట్టాను" అంది. ఇంద్రజ బి.ఎ. పూర్తిచేయడం ఇప్పుడు చాలా ఈజీ. ఎందుకంటే సినిమాలేవీ లేవుగా...ఇంకా బాగా చదువుకోవచ్చు.



—ఎల్.